క్లుప్తంగా

రేపు డివిజన్ స్థాయి 'స్పందన'

ఆగిరిపల్లి/నూజివీడు: ఆగిరిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 9.30 గంటలకు డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు శనివారం తెలిపారు. ప్రజల అర్జీలను నేరుగా సబ్ కలెక్టర్‌కు అందజేయవచ్చన్నారు. డివిజన్‌లోని తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

రూ.40 వేలు విరాళం

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఎంపీపీ పాఠశాల అభివృద్ధికి దాతలు రూ.40 వేలు విరాళం అందజేశారు. తెలంగాణకు చెందిన విశ్రాంత ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఖలీల్ రెహ్మాన్, షాజహ దంపతులు పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇర్ఫాన్‌పాషా ఆధ్వర్యంలో హెచ్‌ఎం నాగమల్లేశ్వరికి నగదు అందించారు.

14న సామూహిక వివాహాలు

విస్సన్నపేట: స్థానిక భగవాన్ సత్యసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని వివాహం కుదుర్చున్న వధువులకు మే 14న సామూహిక ఉచిత వివాహం జరిపిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి తెలిపారు. ఈ నెల 8వ తేదీలోగా నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 98854 26382, 99638 24883, 90528 93728 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

జి.కొండూరు: పినపాక గ్రామానికి చెందిన దొప్పల మంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అతని కుటుంబానికి జి.కొండూరు పీఏసీఎస్ బ్యాంకు చైర్మన్ వి.రాంబాబు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని అంజనేయపురంలో కిడ్నీ వ్యాధితో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వ తక్షణ ఆర్థిక సహాయాన్ని తహసీల్దార్ సురేష్ బాబు శనివారం అందజేశారు. కిడ్నీ వ్యాధితో తలుపుల శ్రీను మరణించగా అతని భార్య రాణికి రూ.10 వేల తక్షణ సాయాన్ని అందించారు. సర్పంచ్ మామిడి కుటుంబరావు, వీఆర్వో గోపాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య పాల్గొన్నారు.

సీఎం జగన్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు



గొల్లపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేశామని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో దాదాపు లక్షకుపైగా కుటుంబాలు ఉండగా 95వేల కుటుంబాల వద్దకు వెళ్లిన జగనన్న సైనికులు పార్టీ ఆదేశాల మేరకు పని చేశారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. కె.తాడేపల్లి, పోలవరం మట్టి అక్రమంగా తవ్వుతున్నారని ఆరోపిస్తున్న ఉమా, గత మూడు పర్యాయలు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. 1999లో ఉమా వదిన ఎలా చనిపోయింది, ఆ సమయంలో సెంటు భూమి కూడా లేని ఉమా పేరకంపాడులో 70 ఎకరాల పొలం ఎలా కొన్నాడో సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీలు ఇస్లావత్ ప్రసన్నరాణి, రామినేని ప్రవణ్య, కాజ బ్రహ్మయ్య, అంకం మోహన్‌రావు, భరత్‌కుమార్ రెడ్డి, గేరా సుమన్ పాల్గొన్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, నాయకులు

రాష్ట్ర ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్ వెంటే..

నూజివీడు: రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముగిసిన నేపథ్యంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 20 రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. నియోజకవర్గంలో 1,02,798 గృహాలుండగా ఈ కార్యక్రమంలో 94,323 గృహాలను సందర్శించామని, ఇందులో 82 వేల మంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా మిస్డ్ కాల్స్ ఇచ్చారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కౌన్సిలర్ కొమ్ము వెంకటేశ్వరరావు, నాయకులు మేకల అనిల్, షేక్ మస్తాన్, షేక్ మున్షీ, హరికోటి ప్రసాద్, ఆరేపల్లి రాంబాబు, కళ్లేపల్లి ఆదినారాయణ పాల్గొన్నారు.



తిరువూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి, నాయకులు

'మా నమ్మకం నువ్వే జగన్'కు భారీ స్పందన

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించిందని ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 20 రోజులుగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలో 85 వేల కుటుంబాలు ఉండగా, 70 వేల కుటుంబాలు స్వచ్ఛందంగా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి మద్దతు తెలిపి మిస్డ్ కాల్స్ ఇచ్చారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షులు పిల్లి వనజాక్షి, నాగలక్ష్మి, జెడ్పీటీసీలు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్లు బాజీ, నారాయణరావు, ప్రకాష్‌రెడ్డి, సతీష్, మండల కన్వీనర్ చావా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

నెమలి(గంపలగూడెం): మండల పరిధిలోని నెమలిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. నెమలిలో శనివారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గాంధీ సెంటర్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్లలో నెమలిలో రూ.11.25 కోట్లు సంక్షేమం, అభివృద్ధి పథకాలను అందజేశామన్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, సర్పంచ్ దుబ్బాకుల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు కుంభగిరి వెంకటకృష్ణ, నేతలు చిన్నశెట్టి రత్తయ్య, కావూరి శశిరేఖ, చావా వెంకటేశ్వరరావు, కావూరి వినయ్‌కుమార్, గోగులమూడి చెన్నకేశవరెడ్డి, చెరుకు నరసారెడ్డి, పామర్తి మల్లిఖార్జునరావు, సాలి రమేష్, కుంభగిరి మురళీ, జోనే బోయిన వెంకట కృష్ణ, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నూజివీడు: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు మండలంలోని బోర్వంచ శివారు కొత్తూరు, కొన్నంగుంటలలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ప్రతాప్ కాలనీలో ఇంటింటికి వెళ్లి ఈ నాలుగేళ్లలో ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వం నుంచి కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, సర్పంచ్ కుంటం ఉదయరాజు, ఎంపీడీఓ సుందరి, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, ఎంపీటీసీ సభ్యులు తాడేపల్లి సునీత, సయ్యద్ సలీంపాషా ఖాద్రీ, ఉపసర్పంచ్ కిదర్ పాషాఖాద్రీ, మరీదు రమేష్, రాంబాబు, పామర్తి రాజా, ధనుంజయ్, ఆరేపల్లి రాంబాబు, ముల్లంగి జమలయ్య, ఏపీవో సోమేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు ఆధార్ అనుసంధానం చేయాలి

తిరువూరు: ప్రభుత్వ పెన్షను పొందుతున్న రిటైర్డు ఉద్యోగులు తమ ఆధార్‌కు మొబైల్ నంబరు అనుసంధానం చేసుకోవాలని తిరువూరు ఉప ఖజానాఅధికారి ఎండీ అర్షద్ ఉమర్ తెలిపారు. మే 10వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.

జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్‌కు డాక్టరేట్



మునునూరు: సామాజిక, సాంస్కృతిక, విద్యా రంగాల్లో గత 15 ఏళ్లుగా చేస్తున్న విశేష కృషిని గుర్తించి తనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు మునునూరు జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్ శనివారం చెప్పారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు జీను రామశర్మ స్వామీజీ ఆధ్వర్యంలో ఇచ్ఛా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.పురుషోత్తమ్ అధ్యక్షతన తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లో శనివారం స్నాతకోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ తమిళనాడు వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే మనోహరన్ చేతుల మీదుగా ప్రతాప్ డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.



















సంక్షిప్త వార్తలు

■ **జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ దుందుభి**

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): జేఈఈ మెయిన్స్‌లో గుంటుపల్లి ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు 118, 232, 419, 557 తదితర 10 ర్యాంకులు సాధించినట్లు విద్యా సంస్థల ప్రతినిధులు తెలిపారు. చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సీఈవో సురేందర్‌రెడ్డి, జీఎం ప్రసాద్, డీజీఎం రమణ, డీన్ అరవింద్, జోనల్ ఇన్‌చార్జి కృష్ణారావు ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

■ **నేడు 'దయల్ యువర్ డీఎం'**

నూజివీడు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆదివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం సూర్యపవన్ కుమార్ శనివారం తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటలలోపు 99592 25461 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలని కోరారు.

■ **విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి**

గానుగపాడు(తిరువూరురూరల్): వేసవి సెలవుల్లో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తిరువూరు మండలం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి పేర్కొన్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు ఇస్తున్న సందర్భంగా శనివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు రాంప్రదీప్, సుదర్శన్, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, శోభారాణి పాల్గొన్నారు.

■ **గుంటుపల్లిలో చలివేంద్రం ప్రారంభం**

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని వర్క్‌షాపు చీఫ్ వర్క్ మేనేజర్ శ్రీనివాస్ ప్రారంభించారు. గత 20 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని యూనియన్ కార్యదర్శి సురేష్ తెలిపారు. మజ్జిగ పంపిణీని డెప్యూటీ సీఎంఈ రవీంద్రనాథ్ ప్రారంభించారు. బ్రాంచి కార్యదర్శి నాగేశ్వరరావు, చైర్మన్ సుబ్బారెడ్డి, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

■ **రక్తహీనత నివారణ మందుల పంపిణీ**

జి.కొండూరు: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను వైద్యాధికారులు శనివారం పంపిణీ చేశారు. వెల్లటూరు ఎంపీయూపీ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసిన వైద్యాధికారులు, వేసవి సెలవులకు సరిపడా మాత్రలను విద్యార్థినుల తల్లిదండ్రులకు అందజేశారు. ఎంపీడీఓ అనూరాధ, తహసీల్దార్ రోహిణీదేవి, మండల వైద్యాధికారి శ్రీకళ్యాణి చేతులమీదుగా మాత్రలను అందజేశారు. వైద్య సిబ్బంది ఉన్నారు.

■ **భూవివాదం నేపథ్యంలో బందోబస్తు**

నూజివీడు: పట్టణంలోని రామన్నగూడెం రోడ్డులో ప్రైవేటు జూనియర్ కాలేజీ సమీపంలో భూవివాదం నేపథ్యంలో ప్రహరీ నిర్మాణ పనులకు శనివారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిర్మాణ పనులు చేపట్టిన స్థలానికి కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ ఇచ్చిందని స్థలం యజమానులు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కుమారులైన బసవా వినయ్, బసవా రామకృష్ణలు అడ్డురావడంతో డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని ఆగిరిపల్లి స్టేషన్‌కు తరలించారు. అనంతరం గోడ నిర్మాణ పనులను భూమి యజమానులు చేపట్టారు. అనంతరం బసవా వినయ్, రామకృష్ణలను స్టేషన్ బెయిల్ ఇచ్చారు.

■ **బంగారం చోరీ కేసులో మహిళల అరెస్ట్**

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలోని ఓ జ్యూయలరీ షాపులో ఈ నెల 26న చెవి దిద్దులు చోరీ చేసిన కేసులో ఇద్దరు మహిళా నిందితులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను శనివారం మీడియా ముందు ప్రవేశ పెట్టారు. బంగారం దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్రైమ్ ఎస్ఐ వెంకటేశ్వరరావు బృందం సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పి.శ్రీను తెలిపారు. ఫెర్రీరోడ్డులో ఉన్న మహిళలను అనుమానంతో విచారించగా వారి వద్ద 9 గ్రాముల రెండు చెవి దిద్దులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారు వీరులపాడు మండలం గోకరాజుపాలెంకు చెందిన బొజ్జగాని జ్ఞానమ్మ, గుంటూరు జిల్లా పెనమాకకు చెందిన తోకల రాజేశ్వరిగా గుర్తించారు. బంగారం దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు.

■ **నవోదయ పరీక్షకు 10 మంది గైర్హాజరు**

విస్సన్నపేట: స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరమ్మ తెలిపారు. 133 మందికి 123 మంది విద్యార్థులు హాజరయారన్నారు.

■ **ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శ్రీ శేషాచాల శ్రీనివాసస్వామి ఆలయంలో 33వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు తూమాటిశ్యామ సుందర శ్రీనివాసాచార్యులు, విజయ్‌కుమారాచార్యుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవతో ప్రత్యే కార్యక్రమాలను ప్రారంభించారు. శేషాచల శ్రీనివాసస్వామికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం జరిపారు. అనంతరం స్వామివారిని పెళ్లి కుమారునిగా చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రత్యేక పూజలను శాస్త్రోత్తకంగా జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాపరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులు పాల్గొన్నారు.

■ **బీరు సీసాతో దాడి.. వ్యక్తికి గాయాలు**

నూజివీడు: బీరుసీసాతో దాడిలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణంలోని స్టేషన్‌తోటకు చెందిన నంద్యాల రాజు(32) గొడుగువారిగూడెం రోడ్డులోని ఇళ్ల స్థలాల్లో శనివారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి ఆడుతుండగా గాంధీనగర్‌కు చెందిన గణేష్ అనే అతను వచ్చి రాజుపై దాడి చేశాడు. ఈ క్రమంలో చేతిలో ఉన్న బీరు సీసాతో గణేష్ కొట్టడంతో రాజు తలకు గాయమైంది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

■ **పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ**

కొత్తగూడెం(మైలవరం): కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో శనివారం 270 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.5,53,164లు బోనస్‌ను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పుల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరు రామిరెడ్డి, విజయవాడ పాల ఫ్యాక్టరీ మైలవరం క్లస్టర్ మేనేజర్ తుమ్మల యశ్వంత్ పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అప్పిడి సాంబిరెడ్డి, వీఎంసీ సూపర్‌వైజర్ గోపికృష్ణ, సంఘం వేతన కార్యదర్శి వెంకటరెడ్డి, పాలక వర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

■ **నవధాన్యాల సాగుపై అవగాహన**

పుల్లూరు(మైలవరం): రైతులు జనుము, జీలుగతో పాటు 30 రకాల మొక్కలు పొలంలో చల్లుకోవడం వలన భూమికి కావాల్సిన అన్ని పోషకాలు లభిస్తాయని ఏసీఆర్‌పీఎస్ యూనిట్ ఇన్‌చార్జి జన్ని శాంతికుమారి తెలిపారు. పుల్లూరు గ్రామంలో నవ ధాన్యాలు సాగు కార్యక్రమంలో 2023-24 వార్షిక ప్రణాళికలో భాగంగా శనివారం నిర్వహించిన ర్యాలీలో రైతులు పాల్గొన్నారు.

■ **మొక్కజొన్నకు మద్దతు ధర ఇవ్వాలి**

మైలవరం: మొక్కజొన్నను ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద జాతీయ రహదారిపై శనివారం నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. నేతలు పీ.వీ.ఆంజనేయులు, మద్దిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

■ **ఆగిరిపల్లిలో 'ఫ్యామిలీ డాక్టర్'**

ఆగిరిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యధికారి జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని కనసానపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని మందులు అందజేశారు.

■ **నకిలీ పురుగు మందులపై ఫిర్యాదు**

తిరువూరు: నకిలీ పురుగు మందులు వినియోగించి దాళ్వా ధాన్యం దిగుబడి తగ్గి నష్టపోయామని గంపలగూడెం మండల రైతులు శనివారం ఎమ్మెల్యే రక్షణనిధికి ఫిర్యాదు చేశారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో గంగదేవిపాడు, అమ్మిరెడ్డిగూడెం గ్రామాల రైతులు అమ్మిరెడ్డిగూడెంలోని ఒక దుకాణంలో కొన్న కోరాజిన్ మందును పిచికారీ చేసి నష్టపోయామన్నారు. కంపెనీపై చర్యలు తీసుకోవడంతో పాటు పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

■ **ఘనంగా పాఠశాల ప్రథమ వార్షికోత్సవం**

ఆగిరిపల్లి: మండలంలోని ఎస్.ఏ.పేటలోని ఫౌండేషన్ ప్లస్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం మక్కె వేణుగోపాలరావు మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు పేరెంట్స్ కమిటీ సభ్యులందరూ కృషి చేయాలన్నారు.

■ **100 మందికి వైద్య పరీక్షలు**

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జాకీర్‌హుస్సేన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం మోహనరావు నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ మామిడి సీతారామారావు నిర్వహించారు. 100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మహాభాష, కామేశ్వరరావు పాల్గొన్నారు.

■ **ఎల్బీఆర్సీఈ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ**

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఫ్రెష్‌మెన్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకురాలు ఎస్.అరుణ ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ వై.రామకృష్ణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీని ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు శనివారం తెలిపారు. అరుణను కళాశాల యాజమాన్యం అభినందించింది.

■ **నేటి కార్యక్రమాలు**

మైలవరం: డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం మానవ హక్కుల ఆవశ్యకతపై అవగాహన సదస్సు జరుగుతుందని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ డాక్టర్ జ్ఞాన సుందరి తెలిపారు.

గంపలగూడెం: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు నాళ్లా చిన్న సత్యంబాబు తెలిపారు.

మెట్టగుట్ట(గంపలగూడెం): బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీశేషాచల శ్రీనివాస స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం అందజేస్తామన్నారు.

■ **రేపు ఆలయ వార్షికోత్సవం**

గంపలగూడెం: గంపలగూడెం ముత్యాలమ్మ గుడి 8వ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు.